# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 259 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శనివారం 16 మే 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# 2034లో దేశ రాజకీయాల్లోకి..

## అప్పటి వరకు నేనే సీఎం: రేవంత్ రెడ్డి



### ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా

### రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా

### రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా

### సిఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 15 (నమస్తే ఉదయం)**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉ ంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానిం చారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉ ందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానిం చారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034

..మిగతా 2లో



## వారానికి రెండ్రోజులు

# వర్చువల్ విచారణ

**న్యూఢిల్లీ, మే 15 (నమస్తే ఉదయం)**


పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఇంధనం వాడకాన్ని తగ్గించుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టు కూడా పొదుపు చర్యలు చేపట్టింది. వారానికి రెండు రోజులు సోమ, శుక్రవారం పూర్తి స్థాయిలో వర్చువల్ విధానంలో విచారణ జరపాలని నిర్ణయించింది. అంతేకాదు, మంగళవారం నుంచి గురువారం వరకు హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడతామని, కక్షిదారులు వీలును బట్టి ఎలాగైనా పాల్గొనవచ్చని పేర్కొంది. ఈ మేరకు సుప్రీం కోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేసింది. కొత్త ఏర్పాట్ల ప్రకారం.. ఇంధనం పొదుపులో భాగంగా న్యాయమూర్తులు కూడా కార్ పూలింగ్ ను ప్రోత్సహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది. రోజువారీ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవడంతో పాటు ప్రతి రిజిస్ట్రీ లేదా సెక్షన్‌లోని 50 శాతం సిబ్బందికి వారానికి గరిష్ఠంగా రెండు రోజులు వర్క్-ఫ్రం-హోమ్‌కు అనుమతించాలని సూచించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకోవాలని, అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఇప్పటికే పలువురు ముఖ్యమంత్రులు, ప్రముఖులు భద్రతా శ్రేణిలో వాహనాలను తగ్గించుకుంటున్నారు.

## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

### బ్రిడ్జిపై నుంచి అదుపుతప్పి కిందపడ్డ ట్రాక్టర్

### ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం

2



## బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు

### మహేష్ కుమార్ గౌడ్

### ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని ఆరోపణ

### బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని వ్యాఖ్య



**హైదరాబాద్, మే 15 (నమస్తే ఉదయం)**

తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో దశ ఎస్ఐఆర్ నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, శుక్రవారం కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని, బెంగాల్

..మిగతా 2లో

## రక్షణ రంగంలో భారత్

# స్వావలంబన దిశగా పురోగతి


### యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్

### పుట్టపర్తి పర్యటనలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**పుట్టపర్తి,మే 15 (నమస్తే ఉదయం)**

యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల్లో డ్రోన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏపీలో రూ.480 కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రారంభిస్తున్నామని చెప్పుకొచ్చారు. శుక్రవారం పుట్టపర్తిలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం చంద్రబాబు పర్యటించారు. పుట్టపర్తిలో

..మిగతా 2లో



# వాహనదారులకు షాక్

### భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు..

### నేటి నుంచే అమల్లోకి..




**హైదరాబాద్, మే 15 (నమస్తే ఉదయం)**

ఊహించనట్లే జరిగింది. ఆయిల్ కంపెనీలు వాహనదారులకు బిగ్ షాకిచ్చాయి. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. లీటర్ పెట్రోల్ పై రూ.3.14 పెరగ్గా.. డీజిల్ పై రూ.3.11 పెరిగింది. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. ఈ కారణంగా దేశంలోని ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నాయి. దీనికితోడు దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత రోజురోజుకు తీవ్రమవుతోంది. ఇప్పటికే ఉన్న నిల్వలు తగ్గిపోతున్నాయి. దీంతో పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని నరేంద్ర మోదీ సైతం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటనకు వచ్చాయి. ఈ క్రమంలో జరిగిన బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. పొదుపు సూచనలు

..మిగతా 2లో



## నీట్ విద్యార్థుల ఆత్మహత్యపై

# రాహుల్ ఆందోళన

### ప్రభుత్వం ఎప్పుడు కళ్లు తెరుస్తుందని ప్రశ్న

### ఆత్మహత్యలు కావు..వ్యవస్థలు చేసిన హత్యలు

**న్యూఢిల్లీ, మే 15 (నమస్తే ఉదయం)**

నీట్ పరీక్షల రద్దుతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులవి వ్యవస్థలు చేసిన హత్యలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. లఖింపూర్ ఖేరీకి చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు.


# నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

**జూన్ 21న ఎగ్జామ్ నిర్వహణకు తేదీ ఖరారు**

**వివరాలు వెల్లడించిన ఎన్‌టిఎ**

**న్యూఢిల్లీ,మే15(నమస్తే ఉదయం)**

ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని (నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా




ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం.

# కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి**

**కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్ పల్లి, మే 15 (నమస్తే ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు వేడెక్కుతున్న వేళ, శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కీలక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఒకే ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఓట్లను సైతం తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా పక్కనపెట్టి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ముందుకు వెళుతోందని, అలాంటి పరిస్థితులను ప్రజల్లో ఎండగట్టే బాధ్యత ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తపై ఉందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేస్తూ



ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు మాజీ కేసీఆర్ నాయకత్వం వైపు ప్రజలు మళ్లీ ఆశతో చూస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించిన ఆయన, ఇకనైనా ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, "మేమున్నాం" అనే ధైర్యాన్ని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందించాలని ఆయన కోరారు. త్వరలోనే కూకట్‌పల్లి నియోజకవర్గ స్థాయిలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, సాభియా గౌసుద్దీన్, పగడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్, మహేశ్వరి శ్రీహరి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వివేకానంద నగర్‌లో సర్వీస్ రోడ్డు పనులకు వేగం

**ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదేశాలతో రంగంలోకి అధికారులు**

**షాపు యజమానులు, వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో త్వరలోనే రోడ్డు పనుల పూర్తి**

**కూకట్ పల్లి, మే 15 (నమస్తే ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్న ఎమ్మెల్యే, పి.ఎ.సి చైర్మన్ అరికెపూడి గాంధీ వివేకానంద నగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రోడ్డు సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు. ఈ నేపథ్యంలో వివేకానంద నగర్ మెయిన్ రోడ్డులోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి వివేకానంద చౌరస్తా వరకు మిగిలిపోయిన సర్వీస్ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ, మున్సిపల్ అధికారులు, ఎలక్ట్రిసిటీ శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రత్యక్షంగా పర్యటించారు. రోడ్డుపై అడ్డంకిగా ఉన్న విద్యుత్ పోల్స్, నేమ్ బోర్డులు, ముందుకు వచ్చిన షెడ్లు, పైపులను తొలగించి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



పిలుపుకు స్పందించిన స్థానిక షాపు యజమానులు తమ షాపుల ముందున్న బోర్డులు, పైపులు తొలగించి రోడ్డు పనులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమానికి తమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమని, మిగిలిపోయిన సర్వీస్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుకు బాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ మధు, ఎలక్ట్రిసిటీ ఏఈ చైతన్య, ట్రాఫిక్ సీఐతో పాటు వెల్ఫేర్ కమిటీ సభ్యులు జి. నర్సింగ్ రావు, లక్ష్మీనారాయణ, కిషోర్, జి. ప్రసాద్, వెంకటేశ్వరరావు, కె.వి.రావు, కొండారెడ్డి, డి. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

**ప్రజలకు మజ్జిగ, పండ్లు, మంచినీరు పంపిణీ చేసిన ఎంసీఆర్ కాంప్లెక్స్ కమిటీ సభ్యులు**

**కూకట్ పల్లి, మే 15 (నమస్తే ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీ రామాలయం దేవాలయం ముందు ఉన్న ఎంసీఆర్ కాంప్లెక్స్ వద్ద వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజలను ఆకట్టుకుంది. ఎంసీఆర్ కాంప్లెక్స్ అధ్యక్షులు అభిలాష్ రెడ్డి, స్వాతి దంపతులు ఆధ్వర్యంలో ఈ చలివేంద్రంలో ప్రజలకు చల్లని మంచినీరు, మజ్జిగతో పాటు పండ్లను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి హాజరై చలివేంద్రం వద్దకు వచ్చిన ప్రజలకు స్వయంగా మజ్జిగ, పండ్లు, మంచినీరు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సేవా భావంతో ముందుకు వచ్చిన అభిలాష్ రెడ్డి -- స్వాతి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి. ప్రసాద్, లక్ష్మీనారాయణ, కొండా రెడ్డి, వైవి రావు, నర్సింగ్ రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొని మజ్జిగ, పండ్ల పంపిణీలో చురుకుగా పాల్గొన్నారు. అలాగే ఎంసీఆర్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, జయలక్ష్మి, స్వాతి, శివప్రసాద్, రవి రెడ్డి, సురేష్ బాబు, శ్రావణి తదితరులు సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి కమిటీ సభ్యుడిని పురేందర్ రెడ్డి




ప్రత్యేకంగా అభినందించారు. వేసవి వేళ ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా నిర్వహించిన ఈ చలివేంద్రం స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది.

# 2034లో దేశ రాజకీయాల్లోకి..

మొదటి పేజీ తరువాయి...

వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు

మొదటి పేజీ తరువాయి...

ఎన్నికలే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి 'దొంగ ఓట్ల' సహాయంతోనే గెలిచారని ఘాటుగా ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు లేనందున, ఈ సవరణ ప్రక్రియను తొందరపాటుతో కాకుండా ఏడాది పొడవునా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**వినతిపత్రంలోని ప్రధాన సూచనలు:**

గత 25 ఏళ్లలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగినందున, ఈ ప్రక్రియను ఒకటిన్నర సంవత్సరం నుంచి నుంచి 2 ఏళ్ల పాటు

# రక్షణ రంగంలో భారత్ స్వావలంబన దిశగా పురోగతి

మొదటి పేజీ తరువాయి...

యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తి – కోడూరు రోడ్డులోని 130 ఎకరాల విస్తీర్ణంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఆయుధ ఉత్పత్తిలో స్వావలంబన దిశగా భారత్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. రక్షణ శాఖలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనేది కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అంతరం తగ్గించడానికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు చేయిచేయి కలిపి నడుస్తున్నాయని తెలిపారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని తగ్గించామన్నారు. 'యుద్ధ రంగంలో డ్రోన్ టెక్నాలజీ ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో డ్రోన్ సిటీ ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇక నుంచి కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారు. ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంలో కూడా డ్రోన్ పాత్ర కీలకంగా మారింది. హెచ్‌ఎఫ్‌సీఎల్ రూ.1294 కోట్ల పెట్టుబడితో రాబోతోంది. ఆయుధాల తయారీ రంగంలో స్వావలంబన దిశగా కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. యుద్ధసమయంలో సొంత భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. కొన్నేళ్ల క్రితం రక్షణరంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు మారాయి.. గత పదేళ్లుగా చేసిన కఠోర శ్రమకు ఫలితాలు వస్తున్నాయి. 2004లో కేవలం భారత్ రూ.46వేల కోట్ల విలువైన ఆయుధ పరికరాల తయారీ ఉండేది. ప్రస్తుతం రికార్డు స్థాయిలో రూ.1.75లక్షల కోట్లకు చేరిందని గర్వంగా చెబుతున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులకు షాక్

మొదటి పేజీ తరువాయి...

చేశారు. ముఖ్యంగా ఇంధన వినియోగాన్ని తగ్గించాలని, సొంత వాహనాలకు బదులు కార్ పూలింగ్, ప్రభుత్వ రవాణా వ్యవస్థలను ఉపయోగించుకోవాలని, అలాగే ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని.. ఇలా పలు రకాల సూచనలను ప్రధాని నరేంద్ర మోదీ చేశారు. దేశీయంగా గత రెండు నెలలుగా ప్రతి నెలా 37లక్షల టన్నుల పెట్రోల్, 85లక్షల టన్నుల డీజిల్ వినియోగం ఉంటోంది. దీంతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ( ఓఎంసీ)పై భారం భారీగా పెరిగిపోయింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆయిల్ కంపెనీలకు సుమారు రూ.55,416 కోట్ల మేర నష్టాలు వస్తున్నట్లు అంచనా.

వాస్తవానికి దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన మరుసటి రోజే పెట్రోల్, డీజిల్ పెరుగుతాయని ప్రచారం జరిగింది. దీంతో దేశం వ్యాప్తంగా పెట్రోల్ బంక్ ల ముందు వాహనదారులు బారులు తీరారు. ఈ క్రమంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇప్పట్లో పెంచబోమని కేంద్రం స్పష్టం చేసింది. దీంతో పరిస్థితులు సర్దుమణిగాయి. తాజాగా.. పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయించాయి.

హైదరాబాద్ : పెట్రోల్ రూ. 110.50, డీజిల్ రూ.98.70

విజయవాడ : 113.03, డీజిల్ రూ. 100.71

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

**బెంగళూరు, 15 (నమస్తే ఉదయం)**

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మునీరాబాద్ సమీపంలో బ్రిడ్జిపై వెళు న్న ట్రాక్టర్ అదుపుతప్పి కిందపడటంతో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వారు ఓ కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బ్రిడ్జిపై మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రాక్టర్ కిందకు పడిపోయిందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే లారీ ఢీకొట్టడంతో వంతెన పైనుంచి ట్రాక్టర్ కిందపడిందని కూడా అంటున్నారుజ ఈ ప్రమాదంలో ఏడాది చిన్నారి సహా ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. మరో 10 మందికి గాయాలయ్యాయి. కొప్పల తాలూకా మునీరాబాద్ వద్ద వంతెనపై ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగే సమయానికి ట్రాక్టర్‌లో 16 మంది ఉన్నారు. మునీరాబాద్ సమీపంలోని హులిగమ్మ దర్శనానికి ట్రాక్టర్‌లో భక్తులు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. మృతులను సండూరు, కూడ్లిగి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. ఘటనాస్థలాన్ని కొప్పల, విజయనగర ఎస్పీలు పరిశీలించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన 10 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి గల అసలు కారణాలపై విచారణ చేపట్టారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# బండ్లగూడ జాగిర్లో నీటి గోస... రోడ్డెక్కిన జనం

### బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇంచార్జ్ పటోళ్ల కార్తిక్ రెడ్డి ఆధ్వర్యంలో వాక్ ఫర్ వాటర్ పాదయాత్ర

### పాదయాత్రకు భారీ స్పందన

**రాజేంద్రనగర్, మే 15 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌షాకోట్ , బండ్లగూడ, కిస్మత్పూర్ డివిజన్లలో నెలకొన్న తీవ్ర నీటి సమస్యలపై ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో యువ నాయకుడు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. కిస్మత్పూర్ నుంచి బండ్లగూడ పరమేశ్ కేఫ్ వరకు కొనసాగిన ఈ పాదయాత్రలో వేలాదిమంది కాలనీ వాసులు, మహిళలు, యువకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని నీటి సమస్యపై తమ ఆవేదనను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, గండిపేట మండల పరిధిలో రెండు జలాశయాలు ఉన్నప్పటికీ స్థానిక ప్రజలకు తాగునీరు అందని పరిస్థితి దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వారానికి ఒకసారి లేదా పది రోజులకోసారి మాత్రమే నీటి సరఫరా జరగడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకుగురిచేస్తోందన్నారు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తయినా వాటికి నీటిని ఎక్కించలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించిన కార్తీక్ రెడ్డి, జలమండలి మరియు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు అత్యవసరమైన తాగునీటిని కూడాఅందించలేకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చి నిరంతర నీటి సరఫరా జరిగేదని గుర్తు చేశారు. గతంలో ప్రజలకు సక్రమంగా నీళ్లు అందినప్పుడు, ప్రస్తుతం ఎందుకు సమస్యలు తలెత్తుతున్నాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజల సమస్యల కంటే రాజకీయాలపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని కార్తీక్ రెడ్డి మండిపడ్డారు. గండిపేట మండలంలోని భూములు, ప్రజలు చెల్లించే పన్నుల ద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయం వస్తున్నప్పటికీ, వారికి కనీస సదుపాయాలు కూడా అందకపోవడం బాధాకరమన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని విశ్వాసం వ్యక్తం చేసిన కార్తీక్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన వెంటనే పగడ్బందీ ప్రణాళికతో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి రోజు ప్రజలకు తాగునీరు అందేలా దీర్ఘకాలిక చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజల కోసం రోడ్లపైకి వచ్చి పోరాడుతున్న నాయకుడిగా కార్తీక్ రెడ్డి గుర్తింపుపొందుతున్నారని స్థానిక ప్రజలు పేర్కొన్నారు. నీటి సమస్యలపై ఆయన చేపట్టిన ఈ పాదయాత్ర ప్రజలలో కొత్త ఆశలు నింపిందని అభిప్రాయపడ్డారు. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ... ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో మిషన్ భగీరథను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీరు అందించే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేసి సంక్షేమం అభివృద్ధి రెండింటిని సమన్వయం చేస్తూ బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల మౌలిక అవసరాలకు అత్యంత ఇచ్చిందని స్వామి గౌడ్ అన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం అనుభవలేమి పరిపాలన వైఫల్యాల వల్ల ప్రజలు మళ్లీ నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు మిషన్ భగీరథ లాంటి గొప్ప పథకం ఉన్న దానిని సక్రమంగా నిర్వహించలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనమని ప్రజలకు కనీస అవసరమైన త్రాగునీరు కూడా అందించలేని దుస్థితి రావడం దురదృష్టకరం అని స్వామి గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన నాయకత్వం మళ్లీ రాష్ట్రానికి అవసరమని ప్రజలంతా మరోసారి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వాన్ని కోరుకుంటున్నారని స్వామి గౌడ్ తెలిపారు రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు తగిన బుద్ధి చెప్పి బిఆర్ఎస్ ను మళ్ళీ అధికారంలోకి తీసుకొస్తారని కెసిఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని స్వామి గౌడ్ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజ్, మాజీ మేయర్ లతా ప్రేమ్ గౌడ్, ప్రేమ్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రాముడు యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికుమార్, ఎం నవీన్ కుమార్, పాండు, శాంతి కుమార్,శాంతి నాయక్, మల్లీశ్వరి,మాధవి, జ్యోతి, ఇంతియాజ్, మహమ్మద్ ఇస్మాయిల్, నవీన్ కుమార్, చంద్రశేఖర్, మహేందర్, ప్రసాద్, ఫక్రుద్దీన్, మహేష్,రాజేష్, నాగరాజు,రాజ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి,పప్పీ,డిప్పు,సుధాకర్,ఎం చందర్రావు,జి చంద్రశేఖర్,అస్మిన్ కుమార్,సంతోష్ గౌడ్, యాదగిరి, మౌనిక,వెంకటేష్, సయ్యద్,రాజ్ కుమార్, మాలిక్, సుబ్బారావు, దామోదర్, పరశురాం, యాదగిరి, శామ్యూల్, పెంటయ్య, టిల్లు, సాయి రెడ్డి, మాధవి,చంద్రశేఖర్, నార్సింగి సర్కిల్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కురుమ, మైలార్ దేవ్ పల్లి డివిజన్ యువజన అధ్యక్షులు అక్కెం రఘు యాదవ్, నోముల రాము యాదవ్, బండ రాజేష్ యాదవ్, కొంపల్లి జగదీష్ నేత, అశోక్ కుమార్, గంజి రాజు నేత, రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



బండ్లగూడ లో జరిగిన వాక్ ఫర్ వాటర్ కార్యక్రమం సందర్భంగా మాట్లాడుతున్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి




వాక్ ఫర్ వాటర్ ర్యాలీ లో పాల్గొన్న బీ ఆర్ ఎస్ నాయకులు ఎస్ వెంకటేష్ తదితరులు




అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ లో బీ ఆర్ ఎస్ నాయకులు లక్ష్మీ రాజ్ తదితరులు

## బండి సంజయ్ కుమారుణ్ణి అరెస్ట్ చేయమంటే మమ్మల్ని అరెస్ట్ చేయడం బాధాకరం : లక్ష్మీ రాజ్

**అఫ్జల్ గంజ్, మే 15 (నమస్తే ఉదయం)**

మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరత్ ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేస్తున్న మహిళలను పోలీసులు అరెస్టు చేసి అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ లో పెట్టడం బాధాకరమని బీఆర్ఎస్ మహిళా నాయకురాలు లక్ష్మీరాజ్ మండిపడ్డారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మహిళ లతో కలిసి బతుకమ్మ ఆడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన లో జరుగుతున్న అరాచకాలను ఎండగడుతూ పాటలు పాడారు. బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరత్ ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు

## నేడు కరెంటు ఉండని ప్రాంతాలు


**బుద్వేల్, మే 15 (నమస్తే ఉదయం)**



వేసవి ప్రణాళిక పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని మైలార్దేవుపల్లి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు శ్రీనివాస్ ఓ ప్రకటన లో తెలి పారు. మైలార్దేవుపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంటు సరఫరా ఉ ండదన్నారు. సుభాన్ కాలనీ పేజ్ 1, 2, ఆయేషా కాలనీ, హషమాబాద్, టవర్ గల్లీ, దస్తగిరి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాలని శ్రీనివాస్ తెలిపారు.

## నేడు మైలార్దేవ్‌పల్లిలో విద్యుత్ సరఫరాల అంతరాయం

**రాజేంద్రనగర్, మే 15(నమస్తే ఉదయం)**



వేసవి ప్రణాళిక పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మైలార్దేవ్పల్లి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. మైలార్ దేవుపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుండి సాయంత్రం 4 వరకు సుభాన్ కాలనీ ఫేజ్ 1&2, అయేషా కాలనీ, హషమాబాద్, టవర్ గల్లీ, దస్తగిరి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



గ్రంథాలయ దినోత్సవం లో పాల్గొన్న మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ తదితరులు

## రాజేంద్రనగర్‌లో గ్రంథాలయ దినోత్సవం

**బుద్వేల్, మే 15 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో బాగంగా గ్రంథాలయ అధికారిణీ ఎం పిలాత్రి చౌహాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రాజేం ద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయ లు జి శ్రీనివాస్ సీడబ్ల్యుడి విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డి రమేశ్ కుమార్ లు పాల్గొని గ్రంథాలయ ం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. జ్ఞానాన్ని పెంచే గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రకాల దినపత్రికలతో పాటు పోటీ పరీక్షలకు కావాల్సిన అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయాలలో ఉంటాయని, అవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పచ్చ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.




ఎం ఈ ఓ శంకర్ రాథోడ్ ను సన్మానిస్తున్న గ్రంథ పాలకురాలు ఎం పిలాత్రి చౌహాన్



వాక్ ఫర్ వాటర్ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి తో పాటు కలిసి నడుస్తున్న ఆ పార్టీ నాయకులు శీలం తిరుపతి రెడ్డి. చిత్రం లో శాసనమండలి మాజీ చైర్మన్ కె స్వామి గౌడ్ తదితరులు

## బండ్లగూడ జాగీర్ పరిసర కాలనీలు, బస్తీల నీటి కొరత తీర్చాలి

### బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి

**బండ్లగూడ, మే 15 (నమస్తే ఉదయం) :**



రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ లో నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులకు మద్దతుగా 'వాక్ ఫర్ వాటర్ ' పేరుతో రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి గురువారం పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్లు, వెల్ఫేర్ సంఘాలు, కాలనీ వాసులు, బీ ఆర్ ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పాదయాత్ర సందర్భంగా పి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఆర్థిక, వాణిజ్య ప్రాంతంగా ఉన్నా , ప్రజలు ఇప్పటికీ తాగునీటి కోసం ఇబ్బందులు పడటం బాధాకరమని అయన ఆవేదన వ్యక్తం చేశారు. వాక్ ఫర్ వాటర్ ఉద్యమం ద్వారా అంతరాయం లేకుండా నీటి సరఫరా, జనాభా అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్ ను అరెస్టు చేయకుండా సీఎం రేవంత్ రెడ్డి కాపాడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ కె స్వామి గౌడ్, రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల బీ ఆర్ ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### ఒప్పందం ప్రకారం సకాలంలో పనులు పూర్తి చేయాలి.

### ఇంజనీరింగ్ శాఖల సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్.

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 15(నమస్తే ఉదయం)**

అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, పబ్లిక్ హెల్త్ , విద్యా, వైద్య, తదితర ఇంజనీరింగ్ శాఖల పర్యవేక్షణలో చేపట్టిన ఆయా నిర్మాణాల పురోగతిపై శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీ నిధులతో చేపట్టిన ఆయా పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. రూసా, నాబార్డ్, నేషనల్ హెల్త్ మిషన్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, తదితర నిధులతో చేపట్టాల్సిన పనులు పెండింగ్ లో ఉండకూడదని, టెండర్స్ పూర్తి చేసి కాంట్రాక్టర్లతో ఒప్పందం ప్రకారం పనులు చేయించాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, మెడికల్ కళాశాల భవనం, ఇతర నిర్మాణాల పనులను కూడా వేగవంతం చేయాలన్నారు. క్వాలిటీ కంట్రోల్, ఎంబీలు, తదితర రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. ఆయా చేసిన పనులకు సంబంధించిన ఫోటోలు సకాలంలో పంపించాలని ఆదేశించారు. కేజీబీవీ లలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ప్రతిపాదనలు చేసి పంపాలన్నారు. పీఎం శ్రీ నిధులతో ఆయా పాఠశాలల్లో చేపట్టాల్సిన లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ వంటి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. అంగన్వాడి భవనాలు, ఇతర ఆన్ గోయింగ్ పనులన్నింటినీ త్వరగా పూర్తి చేయాల్సిందిగా సంబంధించిన శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆయా శాఖల ఈఈలు ప్రభాకర్, ప్రగతి, రామచందర్, డీఈలు, ఏఈఈ లు, తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడితోనే అధిక నికరాదాయం

### 'అప్పారెడ్డి గూడెం ' లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం

**బుద్వేల్, మే 15 (నమస్తే ఉదయం)**

పంటల మార్పిడి ద్వారానే రైతులకు అధిక నికరాదాయం వస్తుందని, తద్వార భూసార పరిరక్షణ, వాతావరణ కాలుష్యం నివారణ సాధ్యమౌతుందని ప్రొఫెసర్ జయశం కర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ మల్లయ్య లు తెలిపారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో బాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నందిగామ మండలం అప్పారెడ్డిగూడెం గ్రామంల రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మల్లేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ మల్లయ్య లు మాట్లాడుతూ, రైతులు తప్పకుండ తమ పొలంలో మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మట్టి పరీక్షల ఫలితాల ఆదారంగా భూమిలో ఉన్న పోషక లభ్యత తెలుసుకుని సేంద్రీయ ఎరువులతో పాటు సిఫారుసు చేసిన రసాయనిక ఎరువలనే వాడాలని సూచించారు. తద్వార సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. పచ్చి రొట్టే పైర్లు, జీవన ఎరువుల వినియోగం పెంచుకొని యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. అలా చేయడం ద్వారా చీడ పీడల ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. భూసార పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణ సాధ్యమౌతుందన్నారు.సేంద్రీయ పద్ధతిలో సాగు చేయడం ద్వారా అధిక మార్కెట్ ధరలు పొందుకునే అవకాశం ఉంటుం దన్నారు. భావి తరాలకు నీటి కొరత లేకుండ ఇంకుడు గుంతలు, ఫాం పౌండ్లు నిర్మించుకోవాలన్నారు. సాగునీటిని దుర్వినియోగం చేయకుండ నీటి ఉత్పాదకతను పెంచాలని, ఆరుతడి పంద్ధతిలో వరిసాగు చేసి వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్నారు. వరి పంటలో సిఫారుసు చేసిన సన్నగింజ రకాలు తెలం గాణ సోనా, కెఎన్ఎం 1638, డబ్ల్యుజీఎల్ 962 వంటి అధిక దిగుబడి ఇచ్చి, చీడపీడలు తట్టుకునే రకాలు సాగుచేసుకోవాలని సూచించారు. నేరుగా వెదజల్లే విధానం, అరుతడి పద్ధతిలో సాగువంటి మేలైన యాజమాన్య విధానాలు పాటించాలన్నారు. సాగునీటి ని పొదువు గా వాడుకోవాలని అన్నారు. కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి రమశివారావు, ఏఈఓ అభ్యుదయ రైతులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.





రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

# ఇర్కిచేడు గ్రామ పంచాయతీలో నిధుల గోల్‌మాల్?


## విచారణ జరపాలని గ్రామస్తుల డిమాండ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 15(నమస్తే ఉదయం)**

పంచాయతీల పాలన గాడి తప్పుతోంది. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ఆలోచనలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ప్రజల సొమ్మును కాజేస్తున్నారు.పంచాయతీల సర్వతోముఖాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయి.అక్రమార్కులకు అధికారం అండదండలు ఉండటంతో నిధుల దుర్వినియోగం వెలుగులోకి రావటం లేదు. దీనికి తోడు ప్రభుత్వాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లక్షల నిధులు స్వాహ అవుతున్నాయి. కేటిదొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలకవర్గాలు కొలువుదీరాక ఈ ఏడాది ఫిబ్రవరిలో 15వ ఆర్థిక సంఘం నిధులు జనాభా ప్రాతిపదికన గ్రామ పంచాయతీలకు కేటాయించారు. గతంలో రెండేళ్ల పాటు పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగింది. అప్పట్లో ఇష్టారాజ్యంగా ఖర్చులు చేసి బిల్లులు చేయగా.. వచ్చిన ఆర్థిక సంఘం నిధులనుంచి డ్రా చేయడం కొసమెరుపు. ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు జమకావడంతో 2023-2024, 2024-2025 లలో గ్రామంలో చేసిన వివిధ పనులకు ప్రస్తుత సర్పంచ్, ఉపసర్పంచ్ పాలకవర్గం అంగీకార పత్రంతో చేయని పనులకు కూడా నిధులు మళ్లించడం జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పన వంటి వాటిలో చేసింది కొంతైతే.. ఎక్కువ మొత్తంలో చెల్లించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి పంచాయతీలో చేపట్టే ప్రతి పని పాలక వర్గం, గ్రామ కమిటీల ఆమోదంతో తీర్మానం మేరకు జరగాలి. కానీ, ప్రస్తుతం ఎక్కడా పట్టించుకోవడంలేదు.ఇలాపంచాయతీ కార్యదర్శు భార్యలు, కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఖాతాల్లోకి మళ్లించినట్లు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. పాలకవర్గం అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, కొందరు రాజకీయ నాయకుల అండదండలతో గ్రామ పంచాయతీ కార్యదర్శి నిధులను ఇష్టానుసారంగా డ్రా చేస్తున్నారని స్థానిక నాయకులు ఆరోపిస్తున్నారు.

**అవకతవకలు ఇలా ..**

ఇర్కిచేడు గ్రామపంచాయతీలో 2025- 2026 ఆర్థిక సంవత్సర నిధుల నుంచి మార్చి 26వ తేదిన వివిధ పనుల కోసం నిధుల డ్రా కోసం అంగీకారం చేస్తూ సర్పంచ్ , ఉపసర్పంచ్ లు తీర్మానం చేశారు. గ్రామ సభ



eGramSwaraj
Simplified Work Based Accounting Application for Panchayati Raj


**Payment Voucher Detail**
Financial Year: 2025-2026
Month: March
State: Telangana
Zilla Panchayat and Equivalent: Jogulamba Gadwal
Block Panchayat and Equivalent: Kaloor Thimmandoddi
Village Panchayat and Equivalent: Irkiched

| | | | |
|---|---|---|---|
| Type Of Transaction | Expenditures | Activity Code | 57648631 DRINKING WATER (2022-2023) |
| Scheme Name | XV Finance Commission-Tied Grant | | |
| Voucher Date | 31/03/2026 | Voucher No | XVFC/2025-26/P/3 |
| Account Head | Expenditure Heads 2215 - Water Supply and Sanitation 103 - Sewerage and Sanitation 56 - Segregation Bins at household (SBM-G) | Amount (in Rs.) | 216,700 |
| Particulars | PS Office Expenses From(03.032024 to 03.03.2026) Rs.156000=00 Prajapalana grama saba expenses Rs.16500=00 swachadanam pachadanam Flexi Rs.800=00 Independence day celebration Rs.3400 Bleching Powder and Lime Rs.40000=00 | Attached File | 1774943250213-irki1.jpeg |
| Mode Of Payment | Details | To Whom Paid | Amount (in Rs.) |
| PFMS | Account Type:Bank Account No.:***************6675 | V RECHAL JYOTHI | 216,700 |

Report generated through eGramSwaraj (https://egramswaraj.gov.in/) on Thu, 14 May 2026 08:46:09 AM.

Export To PDF | Back | Close

నిర్వహించినందుకు గాను రూ.31,500. జనవరి 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా 26,500 ఖర్చు చేసినట్లు, సర్పంచ్ కొత్త కుర్చీ రూ.11,990, కొత్త టేబుల్ రూ.16,990 కొనుగోలు చేసినట్లు, వీధి లైట్ల కోసం 38,000 , పరిసరాల పరిశుభ్రత కోసం రూ.22,880 నిధులు డ్రా చేసుకోవడం ఏమిటని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే డ్రా చేసిన నిధులు ఒకే వ్యక్తి




ఖాతాకు మారడంపై గ్రామస్తులు అరా తీశారు. ఇలా 15వ ఆర్థిక సంఘం నిధులను ఒకే సారి చేయని

పనులకు తప్పుడు బిల్లులతో డబ్బులు డ్రా చేసుకున్నట్లు తెలిసింది.

**బంధువుల వ్యక్తి ఖాతాల్లోకి...**

గ్రామంలో ఏపని చేసినా దానికి సంబంధించిన బిల్లు మొత్తం సామగ్రి కొనుగోలు చేసిన దుకాణం పేరిట సంబంధిత యజమానుల ఖాతాలో పంచాయతీ ఖాతా నుంచి విడుదల చేయాలి. కానీ ఇక్కడ అవేమీ పట్టించుకోకుండా ఆ గ్రామానికి చెందిన కార్యదర్శి నిధులు పక్కా ప్లాన్ తో నిధులు మళ్లించడం కొసమెరుపు. సంబందం లేని వివిధ పనుల పై డబ్బులు బందువులు, సమీప సన్నిహితుల ఖాతాలోకి ట్రాన్స్ఫర్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.గ్రామ పంవాయతీ కార్యదర్శి వినోద్ కుమార్ ను వివరణ కోరగా గ్రామంలో చేసిన వివిధ పనులకు నిధులు డ్రా చేసినట్లు ఇక్కడ ప్రజాధనం దుర్వినియోగం కాలేదని పేర్కొన్నారు.

**రామన్ గౌడ్- ఇంచార్జీ ఎంపీఓ**

గ్రామ పంచాయతీ నిధులు పక్కదారి పట్టినట్లు మా దృష్టికి రాలేదన్నారు.

# యువత భవితకు 'సురక్ష కవచ్'.. డ్రగ్స్ రహిత క్యాంపస్‌లే లక్ష్యం!



సురక్ష కవచ్ కార్యక్రమంలో హ్యాండ్ బుక్ ఆవిష్కరిస్తున్న సీపీ డాక్టర్ రమేష్ ఇతర అధికారులు.



సమావేశానికి హాజరైన విద్యార్థులు సంస్థల ప్రతినిధులు.

**విద్యార్థుల భద్రత, సంక్షేమం కోసం, ఎస్సీ ఎస్సీ హ్యాండ్‌బుక్ ఆవిష్కరణ**

**మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలి..**

**సైబరాబాద్ సీపీ డా. యం. రమేష్**

**సానుకూల లక్ష్యాలతో ముందుకు సాగాలి: సినీ నటుడు రాహుల్ రవీంద్రన్**

**యువత భవితకు 'సురక్ష కవచ్' డ్రగ్స్ రహిత క్యాంపస్‌లే లక్ష్యం!**

**శేరిలింగంపల్లి : మే 15,(నమస్తే ఉదయం)**

యువత ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, విద్యా సంస్థల్లో మాదకద్రవ్యాల నియంత్రణ విద్యార్థుల సమగ్ర సంక్షేమమే ధ్యేయంగా సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీ ఎస్సీ), "సురక్ష కవచ్ కాలేజ్ సేఫ్టీ వెల్ బీయింగ్ హ్యాండ్‌బుక్" ను ఘనంగా ఆవిష్కరించింది. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్ ప్రధాన అతిథిగా హాజరై, పోలీస్ ఉన్నతాధికారులు విద్యా రంగ నిపుణులతో కలిసి ఈ కరదీపికను విడుదల చేశారు.ఈ సందర్భంగా సీపీ డా. యం. రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత ఎదుర్కొంటున్న ఒత్తిడి ఒంటరితనం వ్యసనాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం చదువు మాత్రమే కాకుండా విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై బహిరంగ చర్చలు జరగాలని అభిప్రాయపడ్డారు. డ్రగ్ నెట్‌వర్క్‌లను తుదముట్టించేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటుమన్నారు. అయితే విద్యార్థులు తమ సమస్యలను మౌనంగా భరించకుండా కుటుంబ సభ్యులు లేదా మెంటర్లతో పంచుకోవాలి క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అలవర్చుకోవాలి అని సీపీ పిలుపునిచ్చారు. నల్సార్ విద్యార్థి శ్రీవర్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ డ్రగ్స్ నిర్మూలనలో సమాజం విద్యార్థుల భాగస్వామ్యం అత్యవసరమని సీపీ స్పష్టం చేశారు. ప్రముఖ నటుడు దర్శకుడు రాహుల్ రవీంద్రన్‌మాట్లాడుతూ తోటివారి ఒత్తిడి వల్ల అలవాటయ్యే వ్యసనాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఒక సానుకూల లక్ష్యాన్ని నిర్దేశించుకుని, 'సురక్ష కవచ్' వంటి కార్యక్రమాల ద్వారా సురక్షితమైన క్యాంపస్ వాతావరణాన్ని నిర్మించాలని కోరారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిస్టా రెడ్డి మాట్లాడుతూ కాలేజీల్లో యాంటీ రాగింగ్ చర్యలు భద్రతా కమిటీల పాత్రను వివరించారు. మహిళా భద్రతా విభాగం డీసీపీ కె. సృజన మాట్లాడుతూ విద్యా సంస్థల్లో పోష్, పోక్సో నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ప్రతి కాలేజీలో యాంటీ డ్రగ్ కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. ఎస్సీఎస్సీ ప్రతినిధులు వనితా దాట్ల, చేతనా కాసం, శ్రీవిద్య రెడ్డి డైరెక్టర్ రష్మీ శ్రీవాస్తవ మాట్లాడుతూ విద్యార్థుల నేతృత్వంలోని క్లబ్‌ల ద్వారా వారిని సాధికారులను చేయడమే ఈ హ్యాండ్‌బుక్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. "ముందుకు రండి.. మౌనం వీడి గళమెత్తండి" అని స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యువ బృందం తమ పాటలతో ఉత్సాహాన్ని నింపగా, పలువురు విద్యా సంస్థల ప్రతినిధులు, మానసిక ఆరోగ్య నిపుణులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 15 (నమస్తే ఉదయం)**





గద్వాల్‌లో ఘనంగా ప్రారంభమైన 16వ జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీలుజోగులాంబ గద్వాల్ జిల్లా గద్వాల్ పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న 16వ జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ జయలక్ష్మి నర్సింహులు, వైస్ చైర్మన్ శంకర్, గద్వాల్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ హనుమంతు, పట్టణ కౌన్సిలర్లు, సంస్కార్ స్కూల్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.నాట్య తరంగిణి డాన్స్ అకాడమీ నృత్య విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. అనంతరం ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధికారికంగా 16వ జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల్‌లో జాతీయ స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, తల్లిదండ్రులకు హృదయపూర్వక స్వాగతం మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఇలాంటి పోటీల పాత్ర ఎంతో ముఖ్యమని, గద్వాల్‌కు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువస్తాయని పేర్కొన్నారు.పోటీల్లో పాల్గొంటున్న ప్రతి క్రీడాకారుడు తమ ప్రతిభను చాటి రాష్ట్రం, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు ముట్ట శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మాస్టర్ కె. శ్రీహరి మరియు అసోసియేషన్ సభ్యులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ జాతీయ పోటీలకు దాదాపు 20 రాష్ట్రాల నుంచి సుమారు 1000 మంది క్రీడాకారులు విచ్చేయగా, రెండు రోజుల పాటు పోటీలు కొనసాగనున్నాయి.



# బావిలో దూకి మహిళ మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 15(నమస్తే ఉదయం)**

కుటుంబ కలహాలతో ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం ధరూర్ మండలం అల్వాల్ పాడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అల్వాల్ పాడు గ్రామానికి చెందిన వెంకట్ రెడ్డి భార్య పద్మమ్మ(40) కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన గ్రామ శివారులో ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది చెందింది. గమనించిన స్థానికులు భావిలో నుంచి పద్మమ్మ మృత దేహాన్ని రైతులు బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ఆసుపత్రికి తరలించారు. కొంతకాలంగా కుటుంబ కలాహాల నేపథ్యంలో ఆత్మహత్యకు చేసుకున్నట్లు గ్రామస్తులు వెల్లడించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ప్రత్యేక అధికారి అక్బర్

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 15(నమస్తే ఉదయం):**

కేటిదొడ్డి మండలంలోని కేటీదొడ్డి మరియు కొండాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం జిల్లా ఉద్యాన శాఖ అధికారి,మండల ప్రత్యేక అధికారి అక్బర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నాణ్యత, తూకం ప్రక్రియ మరియు రైతులకు కల్పించిన కనీస వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల నిర్వహణను అత్యంత సక్రమంగా, పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై. రాజవర్ధన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.



# పేదవాడిపై కేంద్ర ప్రభుత్వం కన్నెర్ర

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సీపీఎం ఆగ్రహం

**లీటరుకు రూ.3 పెంపుతో సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు**

**కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజేపీ సర్కార్**

**బాలానగర్, భరత్ నగర్‌లలో సీపీఎం ఆధ్వర్యంలో భారీ నిరసన**

**కూకట్ పల్లి, మే 15 (నమస్తే ఉదయం)**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తోందని సీపీఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పెరిగిన ఇంధన ధరలకు నిరసనగా శుక్రవారం బాలానగర్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద, భరత్ నగర్‌లో పార్టీ శ్రేణులు ధర్నా చేపట్టాయి. ఈ సందర్భంగా ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, ఇప్పుడు లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ. 3 పెంచడం వల్ల మరింత పెరిగి సామాన్యుడి జేబుకు చిల్లు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకు ధరల పెంపు లేదని అబద్ధాలు చెప్పిన ప్రధాని, ఫలితాలు రాగానే దేశ పరిస్థితి సాకుతో ధరలు పెంచడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. యుద్ధాల పేరుతో సాకులు చెబుతూ, చమురు కంపెనీ దళారులకు లాభం చేకూర్చడమే ధ్యేయంగా కేంద్రం పనిచేస్తోందని, ప్రజల రక్తాన్ని తాగుతూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. దేశంలో ఏ విపత్తు వచ్చినా ప్రజలను దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, కేంద్ర ప్రభుత్వం పన్ను రాయితీలు ఇచ్చి ఉంటే సామాన్యులకు ఉపశమనం లభించేదని ఆయన పేర్కొన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజి, కమల్, లక్ష్మి, రాజు, శ్రీను, ఇతర కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసన తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733